# హైకోర్టు స్టేపై హర్షం

కౌటాల, జనవరి 10 : కౌటాల గ్రామ పంచాయతీని వేరు చేయకూడదంటూ హైకోర్టు స్టే ఇవ్వడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని కుమ్రం భీం చౌరస్తాలో కౌటాల, సదాశివపేట, శివలింగపూర్ గ్రామస్తులు మిఠాయిలు పంపిణీ చేసి.. పటాకులు కాల్చారు. కౌటాల గ్రామ పంచాయతీని వేరు చేయవద్దంటూ సదాశివపేట గ్రామానికి చెందిన పెద్దపల్లి భీమయ్య హైకోర్టులో పిటిషన్ వేశాడు. ఈ మేరకు శుక్రవారం హై కోర్టు స్టే ఇచ్చినట్లు న్యాయవాది రవిచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ సీనియర్ నాయకుడు నక్క శంకర్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొమురం మాంతయ్య, బీజేపీ జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కుమ్రం భీం చౌరస్తాలో పటాకులు కాల్చి.. మిఠాయిలు తినిపించుకుంటున్న కౌటాల గ్రామస్తులు

# నేటి నుంచి పత్తి కొనుగోళ్లు బంద్

తాండూర్, జనవరి 10 : బెల్లంపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధి తాండూర్ మండలం రేపల్లెవాడలోని మహేశ్వరి, శ్రీరామ జిన్నింగ్ మిల్లుల్లోని సీసీఐలో పత్తి కొనుగోళ్లను 15 తేదీ వరకు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్ధం భాస్కర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ రావడంతో పాటు నిల్వలు అధికమవడమే కారణమని, తిరిగి 16వ తేదీ నుంచి యథావిధిగా కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొన్నారు.

దండేపల్లి(లక్షెట్టిపేట), జనవరి10 : వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మిల్లులో సీసీఐ కొనుగోళ్లు 15వ తేదీ వరకు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కాటన్ పర్చేస్ అధికారులు తెలిపారు. వెంకటేశ్వర జిన్నింగ్ మిల్లులోలో పత్తి, పత్తి గింజల నిల్వలు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు.

# దళారులు దోచేస్తున్నరు!

**సీసీఐ అధికారులతో కమ్మక్కు**

- జిన్నింగ్‌లలో దూది నాణ్యతను నిర్ణయించేది వ్యాపారులే
- తేమ పేరిట కొర్రీలు పెడుతూ తక్కువ ధరకు కొనుగోళ్లు
- కమీషన్లకు కక్కుర్తిపడి సంపూర్ణ సహకారమందిస్తున్న ఆఫీసర్లు
- నిండా మునుగుతున్న రైతన్నలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : పత్తి అమ్మేందుకు వచ్చిన రైతుల పక్షాన నిలబడాల్సిన అధికారులే దళారులతో కుమ్మక్కై వారిని నట్టేట ముంచుతున్నారు. తేమ పేరిట ఏవేవో కొర్రీలు పెడుతూ కర్షకులను నిలువుదోపిడీ చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఓ జిన్నింగ్ మిల్లులో జరిగిన ఘటనే ఇందుకు సాక్షంగా నిలుస్తున్నది. ఈ నెల 7న అంకుషాపూర్ గ్రామానికి చెందిన రైతు బుట్లే శంకర్ ట్రాక్టర్‌లో పత్తిని తీసుకొచ్చాడు. సీసీఐ అధికారులు తేమశాతాన్ని పరీక్షించి 8 శాతం ఉన్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను సగం ఖాళీ చేశాక పక్కనే ఉన్న దళారీకి సంబంధించిన ఓ వ్యక్తి వచ్చి పత్తి నాణ్యతగా లేదు. తీసుకోవద్దని సీసీఐ అధికారులకు చెప్పడంతో వారు రిజెక్ట్ చేస్తున్నట్లు ఎంట్రీ పాస్‌పై రాశారు. దీంతో పాటు మరో నాలుగు వాహనాలను సైతం ఇదే కారణంతో రిజెక్ట్ చేశారు. ఆపై దళారీ వచ్చి క్వింటాలుకు రూ. 6 వేల (సీసీఐ ధర రూ. 7521) చొప్పున తీసుకుంటామని, లేదంటే తీసుకోలేమని, పత్తిని ఇక్కడి నుంచి తీసుకెళ్లాలని అని చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. అయినా ఫలితం లేకపోవడంతో చేసేదేమీ లేక కన్నీరు పెట్టుకుంటూ అక్కడి నుంచి ఖాళీ చేసిన పత్తిని తిరిగి ట్రాక్టర్‌లో నింపుకొని బయట ప్రైవేట్ దుకాణంలో తక్కువ ధరకు అమ్ముకున్నారు. దీనిని బట్టి చూస్తే అధికారులు-దళారుల మధ్య మిలాఖత్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతున్నది. ఇలా ఈ ఒక్క చోటే కాదు ఆసిఫాబాద్‌లోని అన్ని జిన్నింగ్ మిల్లుల్లోనూ దోపిడీ జరుగుతుందని తెలుస్తున్నది.


ఈ నెల 7న పత్తి కొనమని చెప్పడంతో న్యాయం చేయాలని అధికారులకు మొరపెట్టుకుంటున్న రైతులు

## పత్తి నాణ్యతను నిర్ణయించేది దళారే..

పత్తిలో తేమతో పాటు నాణ్యతను గుర్తించాల్సిన బాధ్యత సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) అధికారులపై ఉంటుంది. కానీ.. జిన్నింగ్ మిల్లుల్లో పత్తిలోని తేమ, నాణ్యతను దళారే నిర్ణయిస్తున్నాడు. అలాగే దూదిని కొనాలా.. వద్దా.. అనేది కూడా దళారీ ఇష్టప్రకారమే జరుగుతోంది. రైతులు ఎంతో కష్టపడి వాహనాల్లో పత్తిని తీసుకొచ్చి రెండు మూడు రోజుల పాటు జిన్నింగ్ మిల్లుల వద్ద అమ్మేందుకు పడిగాపులుకాయాల్సి వస్తున్నది. అంతేకాదు పత్తి కొంటారన్న గ్యారంటీ కూడా కనిపించడం లేదు. దళారీకి నచ్చిన ధరకు అమ్మితేనే కొంటారు. లేదంటే పత్తిలో తేమ ఉందనో.. నాణ్యత లేదనో సాకులు చూపించి తిరస్కరిస్తున్నారు. అధికారుల అండదండలు వ్యాపారులకు పుష్కలంగా ఉండంతో నిత్యం రైతులు మోసపోతూనే ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో దళారులే గ్రామాల్లోకి వెళ్లి రైతుల వద్ద అక్కడే తక్కువ రేటు మాట్లాడుకొని.. ఆపై అదే రైతు పట్టాపాస్‌పుస్తకంపై ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పత్తిని అమ్ముకుంటున్నారు.

## అధికారుల సంపూర్ణ సహకారం వ్యాపారీకే..

'పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలి. దళారుల ప్రమేయం లేకుండా పత్తి కొనుగోళ్లను చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలి' అంటూ ఉన్నతాధికారులు చేసే సమీక్షలన్నీ రైతులను మభ్యపెట్టేందుకేనని.. జిన్నింగ్‌లలో జరుగుతున్న తతంగాన్ని బట్టిచూస్తే అర్థమవుతోంది. వ్యాపారులు ఇచ్చే కమీషన్‌లకు ఆశపడి వారి చెప్పినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.


అధికారులు తిరస్కరించిన పత్తిని చూపిస్తున్న రైతు


పత్తి కొనమని రిజెక్ట్ చేసిన పత్రాన్ని చూపిస్తున్న రైతులు

# ఒక్క హాస్పిటల్.. అనేక అనుమానాలు!

**మాతా శిశు సంరక్షణ కేంద్రం కోసం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం కూల్చివేత**

- ఆపై మూడు నెలలకు మున్సిపల్ కౌన్సిల్ ముందుకు
- తీర్మానం, టెండర్లు లేకుండానే కూల్చివేతపై విమర్శలు
- నేలమట్టమైన భవనాల ఇనుప సామగ్రి మాయం
- తవ్వుతున్న మట్టి పక్కదారి పడుతుందనే ఆరోపణలు
- ఆ స్థలంలో నిర్మించే దవాఖాన ఏమిటన్నదానిపై స్పష్టత కరువు


దవాఖాన నిర్మాణం కోసం చేపడుతున్న మట్టి తవ్వకాలు

మంచిర్యాల, జనవరి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చివేయడం అనేక విమర్శలకు దారితీసింది. మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు పేరిట కోట్లాది రూపాయలతో చేపట్టిన భవనాన్ని నేలమట్టం చేయడం.. అదీ కూడా మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం లేకుండా.. టెండర్లు పిలవకుండానే తొలగించడం చర్చనీయాంశంగా మారింది. ఇక కూల్చిన భవన ఇనుప సామగ్రి మాయం కావడంతో పాటు అక్కడి మట్టి తరలింపుపై అనేక అనుమానాలుండగా, ఇప్పటికీ ఆ స్థలంలో నిర్మించే దవాఖాన ఏమిటన్నదానిపై స్పష్టత లేకపోవడం గందరగోళానికి దారితీస్తున్నది.

## మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం కోసం..

మాతాశిశు సంరక్షణ కేంద్రం నిర్మాణం చేపట్టాలని జిల్లా కేంద్రంలో నిర్మాణ దశలో ఉన్న ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్‌ను గతేడాది అక్టోబర్ 3న కూల్చివేశారు. ఆపై సరిగ్గా మూడు నెలల(అంటే.. ఈ నెల 3న)కు ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ప్యాకేజీ నుంచి దీనిని తొలగించేందుకు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదానికి తీర్మానం ప్రవేశపెట్టారు. అంటే మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం లేకుండా, ఎలాంటి టెండర్లు పిలవకుండానే నిబంధనలకు విరుద్ధంగా కాంప్లెక్స్‌ను కూల్చివేయడం.. అధికార పార్టీ లీడర్లు ఇష్టారాజ్యంగా ప్రజాధనాన్ని విధ్వంసం చేయడం.. ప్రభుత్వ అధికారులు చోద్యం చూడడంపై అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూల్చివేతలపై ప్రజాభిప్రాయం సానుకూలామా.. కాదా.. అన్నది ఎలా ఉన్నా నిబంధనలకు విరుద్ధంగా ఒంటెద్దు పోకడలతో వ్యవహరించిన తీరు చర్చనీయాశంగా మారింది.

## ముందు నుంచి అంటీముట్టని ధోరణి..

ఐబీ చౌరస్తాలోని నాలు గున్నరెకరాలను దవాఖాన నిర్మాణం కోసమని గతేడాది సెప్టెంబర్‌లో మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు అప్పగించారు. కానీ ఇక్కడే హాస్పిటల్ కట్టాలని అప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. దవాఖాన కట్టేది ఇక్కడేనా.. కాదా.. అన్న విషయంలో స్పష్టత రాకముందే మార్కెట్‌ను కూల్చేశారు. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ, ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల నుంచి ఎన్‌వోసీలు తీసుకున్నాకే ఇక్కడున్న నిర్మాణాల కూల్చివేతలు చేపట్టాలి. కానీ, వారి నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే కోట్ల విలువ చేసే ప్రభుత్వ ఆస్తిని నేలమట్టం చేశారు. ఈ విషయంపై జిల్లా ఆర్ అండ్ బీ అధికారులు, మున్సిపల్ అధికారులను ఎవరిని అడిగినా ఆ భూమిని మెడికల్ అండ్ హెల్త్ వారికి అప్పగించామని, కూల్చివేతలకు మాకు ఎలాంటి సంబంధం లేదని దాటవేసే సమాధానాలు చెప్పారు. పోనీ మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ వాళ్లకు ఏమైనా తెలుసా అంటే.. అసలు కూల్చివేతలకు పర్మిషన్లే రాలేదని ఆ అధికారులు తెలిపారు. భూమిని అప్పగించినట్లు వచ్చిన లేఖల ఆధారంగా ఈ భూమిలో ప్రస్తుతం ఉన్న బిల్డింగ్‌లను కూల్చేందుకు పర్మిషన్ కావాలని ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నామని, ఇందుకు ఓ కమిటీని సైతం ఏర్పాటు చేశామని, కానీ మాతో చెప్పకుండానే బిల్డింగ్‌లను కూల్చివేశారని అప్పట్లో అధికారులే చెప్పారు. ఆ కూల్చివేతలకు, కూల్చివేసిన వ్యర్థాల తరలింపునకు మాకు ఎలాంటి సంబంధం లేదన్నారు.


## ఇనుప సామగ్రి పక్కదారి..

అధికారులు చెప్పినట్లే కూల్చివేసిన వ్యర్థాలు పక్కదారి పట్టాయనే విమర్శలు ఉన్నాయి. టెండర్లు కాకుండానే కూల్చివేతలు చేసిన అధికార పార్టీ లీడర్లు.. కూల్చిన వ్యర్థాలను తరలించుకొని పోయారు. భవనాలు కూల్చివేయగా వచ్చిన ఇనుప సామగ్రి సైతం మంచిర్యాలలో ఓ ప్రముఖ స్క్రాప్ వ్యాపారీ షాప్‌నకు తరలిపోయింది. ఈ వ్యవహారమంతా అనధికారికంగానే జరిగినా ప్రభుత్వ అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు సైతం అప్పట్లో వెలువడ్డాయి. ఇక హాస్పిటల్ నిర్మాణానికి సంబంధించి రూ.37 కోట్లతో ఓ గుత్తేదారుకు పనులు అప్పగించారు. నిర్మాణం కోసమని భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. ఇలా వచ్చిన మట్టిని కొన్ని ప్రైవేట్ అవసరాలకు తరలించారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో కాలేజీ రోడ్డులోని మాతాశిశు సంరక్షణ కేంద్రం పక్కనున్న ఓ స్థలంలో ఆ మట్టిని నిలువ చేశారు. కానీ తవ్వింది కొండంత అయితే.. అక్కడ నిల్వ చేసింది పిసరంత. ప్రభుత్వ పనులకు పంపించినట్లు అధికారులు చెబుతున్నా... ఈ వ్యవహారంపైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఎంత లోతునకు తవ్వారు.. అక్కడ ఎన్ని క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది.. ఆ వచ్చిన మట్టిన ఎక్కడెక్కడికి తరలించారనే లెక్కలన్నీ బయటపెట్టాలనే డిమాండ్ సైతం వినిపిస్తున్నది. నిబంధనల ప్రకారం ఎవరైనా మొరం కొనుగోలు చేస్తే వారికి నిల్వ చేసిన ప్రాంతం నుంచి తరలించాలి. కానీ ఇక్కడ అప్పటిదప్పుడు తవ్వి లారీల్లో పంపిస్తూ.. మరోవైపు నిల్వ చేసిన దగ్గర సైతం కొనుగోలు దారుకు మట్టి పంపినట్లు రికార్డులు రాస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అంటే ఒక్క ఆర్డర్‌కు రెండు డెలివరీలు.. ఒకటేమో కొనుగోలుదారుకు, మరొకటేమో ఎవరి జేబుల్లోకో వెళ్లిపోతుందన్నమాట.

## అనుమానాలెన్నో..

హాస్పిటల్ నిర్మాణం కోసమని కూల్చివేతలు, వ్యర్థాల తరలింపు, తవ్వుతున్న మట్టి తరలింపుపై ఇన్ని అనుమానాలుండగానే.. దవాఖాన అంచనా విలువపై సైతం కొన్ని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్కడ వేసిన శిలాఫలకంలో హాస్పిటల్ నిర్మాణం అంచనా విలువ రూ.50 కోట్లు అని ఉంది. కానీ ప్రచారం మాత్రం దాదాపు రూ.350 కోట్లు అంటూ చేస్తున్నారు. కలెక్టరేట్ సముదాయానికి అంత పెద్ద బిల్డింగ్ నిర్మిస్తే రూ.55 కోట్ల నుంచి రూ.60 కోట్లు అయ్యింది. కాలేజీ రోడ్డులో మాతాశిశు సంరక్షణ కేంద్రానికి రూ.17 కోట్లు అయ్యింది. కానీ ఇప్పుడు కట్టే దవాఖాన వందల కోట్లు ఎలా అవుతాయనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. నిర్మాణానికి ఎంత, అందులో పెట్టే పరికరాలకు ఎంత అనే లెక్కలపై స్పష్టత రావాల్సి ఉంది. ఇక ఇక్కడ కట్టేది సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అని చెబుతున్నారు. అలాంటప్పుడు మాతాశిశు సంరక్షణ కేంద్రం ఇందులోకే వస్తదా.. లేకపోతే మరోచోట కడతారా.. అసలు కట్టే దవాఖాన ఏంటి అన్నది కూడా కొంత గందరగోళంగా మారింది. ఈ విషయాలన్నింటిపైనా ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాలంటూ పట్టణ వాసులు డిమాండ్ చేస్తున్నారు.


మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను కూల్చివేస్తున్న జేసీబీ (ఫైల్)



దవాఖాన అంచనా వ్యయం రూ.50 కోట్లు అని ఉన్న శిలాఫలకం

# కమ్మేసిన డంప్‌యార్డు పొగ

**ఇబ్బంది పడుతున్న ఆయా కాలనీల ప్రజలు**

మంచిర్యాలటౌన్, జనవరి 10 : పట్టణంలోని ఆండాళమ్మకాలనీలోగల మున్సిపల్ డంప్‌యార్డు నుంచి రెండు రోజులుగా పెద్ద ఎత్తున పొగ వెలువడుతుండగా, గ్రీన్‌సిటీ, రంగంపేట, పవర్‌సిటీ, ఏసీసీ తదితర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని 36 వార్డులలో వెలువడిన చెత్తను ప్రతిరోజూ ఇక్కడి డంప్‌యార్డుకు తరలిస్తుంటారు. రోజూ దాదాపు 5 మెట్రిక్ టన్నుల చెత్త డంప్‌యార్డుకు వస్తుంది. ఈ చెత్త నిల్వలు పెద్ద ఎత్తున పేరుకుపోయాయి. సేకరించిన చెత్తలో ఎక్కడైనా నిప్పు ఉండి మొత్తం అంటుకుందా ?, లేక ఎవరైనా కావాలనే చెత్తకు నిప్పు పెట్టారా అన్న విషయం తెలియడం లేదు. ఉదయం వేళ కురిసే మంచుతో పాటు డంప్‌యార్డు నుంచి వెలువడే పొగ రోడ్లను కమ్మేస్తుండడంతో వాహనదారులు ప్రయాణించడం ఇబ్బందిగా మారింది. రెండు రోజులుగా పొగ వ్యాపించడం వల్ల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై మున్సిపల్ ఇంజినీర్, ఇన్‌చార్జి కమిషనర్ మసూద్ అలీని వివరణ కోరగా తనకు తెలిసిన వెంటనే మంటలు ఆర్పేందుకు చర్యలు తీసుకున్నానని, వాటర్‌ట్యాంకర్‌ను పంపి నీటిని చల్లించడంతో పాటు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చామన్నారు. ప్రస్తుతం మంటలు తగ్గి పొగ రావడం ఆగిపోయిందని చెప్పారు.


మంచిర్యాల పట్టణంలోని ఆండాళమ్మకాలనీ డంప్‌యార్డు నుంచి వెలువడుతున్న పొగ

# ఎస్టీపీపీకి 'బెస్ట్ వాటర్ ఎఫీషియెంట్ అవార్డు'



ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్టీపీపీ తరుపున అవార్డు అందుకుంటున్న డీజీఎం పంతుల

జైపూర్, జనవరి 10 : మంచిర్యాల జిల్లా జైపూర్‌లోని సింగరేణి విద్యుత్ కేంద్రానికి శుక్రవారం మరో అత్యుత్తమ అవార్డు 'బెస్ట్ వాటర్ ఎఫీషియెంట్' లభించింది. దేశరాజధాని ఢిల్లీలో జరిగిన 3వ జాతీయ పవర్ జనరేషన్ వాటర్ మేనేజ్‌మెంట్ అవార్డ్స్-2025లో భాగంగా దీనిని ఎంపిక చేశారు. కౌన్సిల్ ఆఫ్ ఎన్విరో ఎక్స్‌లెన్స్ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఎస్టీపీపీ తరుపున డీజీఎం పంతుల ఈ అవార్డును అందుకున్నారు. దేశంలోని విద్యుత్ కేంద్రాల్లో అత్యల్పంగా నీటిని వినియోగించినందుకుగాను ఈ అవార్డుకు ఎస్టీపీపీ ఎంపికైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ అవార్డు రావడంపై సీఎండీ బలరాం, డైరెక్టర్ ఈ అండ్‌ఎం సత్యనారాయణ, ఎస్టీపీపీ ఈడీ రాజశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో గంట సమయంలో ఒక మెగావాట్ విద్యుత్ ఉత్పత్తికి గరిష్ఠంగా మూడు ఘనపు మీటర్ల నీటిని వినియోగించడం ఒక ప్రామాణికం కాగా, సాధారణంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఈ ప్రమాణాన్ని దాటే నీటి వినియోగం ఉంటుందని, సింగరేణి విద్యుత్ కేంద్రంలో మాత్రం 2.5 ఘనపు మీటర్ల నీటి వినియోగంతోనే గంట సమయంలో మెగావాట్ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు.

# ఎకరానికి రూ. 15 వేలు ఇవ్వాల్సిందే

- బీఆర్ఎస్ నాయకుల డిమాండ్
- ఆదిల్‌పేట్‌లో ఇంటింటా పోస్టర్లు అంటించి నిరసన

మందమర్రి రూరల్, జనవరి 10 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి రూ. 15 వేల రైతు భరోసా ఇవ్వాల్సిందేనని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని ఆదిల్‌పేట్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాజా రమేశ్ ఆధ్వర్యంలో రైతు భరోసా కింద ఎకరాకు రూ. 15 వేలు చెల్లించాలని కోరుతూ ఇంటింటా పోస్టర్లు అంటించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని మండిపడ్డారు. రైతు భరోసా పేరిట ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు రూ. 12 వేలేనని ప్రకటించడం దారుణమన్నారు. మాయమాటలు చెప్పి రైతన్నల ఓట్లు వేసుకొని అధికారంలోకి వచ్చాక ఇలా మోసం చేయడం తగదని, కాంగ్రెస్ పార్టీ నేతలు రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు బాకీ పడ్డ రైతు భరోసా నిధులను వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వేల్పుల రవి,శ్రీనివాస్ గౌడ్,లౌడం రాజ్ కుమార్,సోదరి పున్నం, కోట్రాంగి రాజలింగు,ఫిరోజ్,వాల రవీందర్ రావు,అడప రాములు,పెంచాల మధు,గడ్డం శ్రీనివాస్,జంపన్న, సూరిమిల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆదిల్‌పేట గ్రామంలో పోస్టర్లను అంటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చెన్నూర్ పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలు చేస్తున్న నాయకులు

# కేసులకు భయపడం

- రైతుల పక్షాన పోరాడుతూనే ఉంటాం
- బీఆర్ఎస్ నాయకులు
- రవీందర్ అరెస్టుపై నిరసన

చెన్నూర్ టౌన్, జనవరి 10 : ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడేది లేదని, రైతుల పక్షాన ఎల్లప్పుడూ పోరాడుతూనే ఉంటామని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు భరోసాపై మాటమార్చడంపై సోమవారం బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టగా, శుక్రవారం బీఆర్ఎస్ నాయకుడు కొప్పుల రవీందర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో నాయకులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు వెన్నుదన్నుగా ఉండాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం వారి నెత్తిపై భస్మాసుర హస్తం పెడుతున్నదని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు రూ.12 వేలే అని ప్రకటించడం ఏమాత్రం సరికాదని, ప్రజాక్షేత్రంలో ముఖ్యమంత్రి తీరును ఎండగడుతామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలని, లేదంటే రైతాంగం పక్షాన పోరాటాలు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.